# ఈ కొట్టుకి శెలవు లేదు

**కాకినాడ మెయిన్‌రోడ్. అనంతమైన జనసంచారం ఉంటుందెప్పుడూ. టూటౌన్ స్టేషన్నుంచి మొదలుపెట్టి జగన్నాథపురం బ్రిడ్జిదాకా ప్రతి రోడ్ క్రాసింగులోనూ కిళ్లీ- కొట్లూ, పుస్తకాల షాపులూ ఉన్నాయి. అన్నీ అంతో ఇంతో సంపాదించుకుంటూనే ఉంటాయి.**

కాని - ఒక బడ్డీకొట్టుంది మానస సెంటర్లో. ఆ బడ్డీకొట్టుకి మాత్రం ఏం సంపాదన లేదు.

కారణం. ఆ బడ్డీకొట్లో ఏం లేవు.

సిగరెట్ పెట్టెలు పెట్టుకోవడానికి అరలతో ఉన్న చెక్క ఫ్రేములున్నాయి. సుమారు ఏభై సోడాబుడ్లు పెట్టుకోవడానికి సరిపడ సోడాస్టాండుంది. చాక్లెట్లూ, బిస్కెట్లూ పెట్టుకునే సీసాలున్నాయి.

బడ్డీకొట్టుకి ముందరగా తాడు కట్టి ఉంది. ఆ తాడుకి క్లిప్పులున్నాయి పత్రికలు వేళ్లాడ్డానికి. గాని ఆ క్లిప్పులు సిగ్గుపడుతున్నట్టున్నాయి ఏ బరువూ లేక.

సగం తెరిచిన గల్లాపెట్టె ఉంది -

అందులో పాత ఆర్టీసీ టిక్కెట్లు, రైలు టిక్కెట్లు, పీచుమిఠాయికిచ్చే రంగురంగుల నకిలీ నోట్లు ఉన్నాయి.

ఆ గల్లాపెట్టె ప్రక్కనే అతను కూర్చున్నాడు.

రంగు మారిపోయిన ఆ బట్టలెప్పుడేసుకున్నాడో. గెడ్డం గీసుకుని ఎన్నేళ్లయిందో. స్నానం చేసి ఎన్నాళ్లయిందో.

అతను సడెన్‌గా గల్లాపెట్టె తెరిచి, ఏదో పెద్దబేరం తగిలినట్లుగా వీధి వైపు చూసి, డబ్బు తీసుకున్నట్లుగా, ఏదో ఇస్తున్నట్లుగా, పెట్టెలో వేసి, తీస్తున్నాడు.

ఆ వ్యాపారం అయిపోయినట్లుగా మళ్లీ కుదురుగా కూర్చున్నాడు.

కాకినాడలో మెయిన్‌రోడ్ మీద వెళ్లేవాళ్లూ, వచ్చేవాళ్లూ అతన్ని పరిశీలనగా చూస్తూంటారు.

ఏంటి అతని వ్యాపారం? బడ్డీకొట్లో ఏం లేదే?

ఉదయం ఎనిమిదింటికల్లా బడ్డీ తెరుస్తాడు. కొన్ని సామాన్లు బయట పడేస్తాడు. వెళ్లి గల్లాపెట్టె దగ్గర భద్రంగా కూర్చుంటాడు.

సాయంత్రం అయిందంటే - ఏదో పనున్నట్టు, మళ్లీ బయట పడేసిన సామాన్లు లోపల పెట్టి కొట్టు మూసేసి బయట నుంచుంటాడు. చాలా సేపు అక్కడే నుంచుని ఎవరి కోసమో చూసి, చూసి, చివరకు ఎవరూ రాక, జగన్నాథపురం బ్రిడ్జి మీదనుండి అలా వెళ్లిపోతాడు.

మళ్లీ మర్నాడుదయం, సాయంత్రం ఇదే. తంతు.

అతనికి సెలవంటూ లేదు. రోజూ ఇంతే!

రోడ్డుమీద వెళ్లేవాళ్లందరూ-

జరిగేవన్నీ చూసేవాళ్లు కొందరు-

చూసీ చూడనట్లు పట్టని వాళ్లూ-

అప్సరస కనిపించినా అభిమానం అడ్డొచ్చి చూడలేక పోయామని బాధపడేవాళ్లూ-

ఎవరేమనుకుంటే మనకేం అని నిర్లజ్జగా ఎక్స్‌రే కళ్లతో ఆడవాళ్లని చూసేవాళ్లూ-

ప్రతీ విషయాన్నీ పరిశీలనగా చూడాలి - ఇందులో ఏదో ఉండి ఉంటుంది - అనుకునేవాళ్లు కొంతమంది.

అందరిలాంటివాడు కాదు మూర్తి.

ఒకరోజు ఫ్రెండ్‌తో అటుగా వెడుతూ " ఆ బడ్డీకొట్టు సంగతేంటి? అందులో ఏమీ ఉండవు. పొద్దున్నే తీస్తాడు. సాయంత్రం ఎత్తుకుపోయేవేవున్నాయ్ అందులో " అన్నాడు. దానికా ఫ్రెండ్

" భలేవాడివే! అనవసరంగా వాడిజోలి కెళ్లకు. వాణ్ణి పలకరించావా, అయిపోయావన్నమాట! వాడితో ఓ గంట మాట్లాడావంటే నువ్వూ వాడి పక్కనే ఇంకో బడ్డీకొట్టు పెట్టుకోవాలి వాడికి తోడుగా - " నవ్వుతూ.

ఎవరైనా సలహా చెబితే వినాలని నియమం ఏమీలేదు. ప్రతి మనిషీ తను ఏం చేయాలనుకుంటే, అది చేసే స్వతంత్రం ఉంది. మూర్తి అతని ఫ్రెండ్ మాట వినదల్చుకోలేదు.

' అయినా, అతన్తో గంట మాట్లాడాల్సిన పనేముంది? బ్రీఫ్‌గా అసలు సంగతి అడిగేస్తే పోలా! ' అనుకున్నాడు.

ఆ రోజు - సాయంత్రం నాలుగైంది.

మూర్తి ఉగ్రతాంబూలం బిగించి బడ్డీకొట్టు దగ్గరకెళ్లాడు. కొంచెం దగ్గర కెళ్లి లోపలికి తొంగిచూశాడు. కొట్లో మనిషిలో చలనం వచ్చింది.

" ఏంటి సార్ ! జర్దాకిళ్లీ కావాలా? గోల్డ్‌స్పాట్ కావాలా? " లేచి నిలబడి అటూ ఇటూ సరుకులేని కొట్లోకి చూసి "ప్చ్" అనుకుని

" సారీ అండీ ! మా తమ్ముడు హైద్రాబాదెళ్లాడు సరుకుకోసం. వచ్చేస్తాడిప్పుడే. కూర్చోండి. మీక్కావల్సినవిస్తాను. "

బడ్డీకొట్టు దిగి, కూసాలూడిపోవడానికి సిద్ధంగా ఉన్న, పడిపోయే స్టూలు మీద కూర్చుని అటూ ఇటూ చూడసాగాడు. చొక్కాతో ముఖం తుడుచుకోసాగాడు. ఆ తుడుచుకునేటప్పుడు చొక్కారంగు ముఖం రంగులో కలిసిపోయింది.

మూర్తిని దాటి ఒక వ్యక్తి వెళ్లిపోతూ -

" ఏవండోయ్ ! అతను పిచ్చాడు వెళ్లిపోండి. కొంచెంసేపయితే ఆ చెక్కల్తో కొడతాడు కూడా. " అన్నాడు. మూర్తి కదల్లేదు.

" మీ తమ్ముడెక్కడి కెళ్లాడు? చెప్పు. నేనెళ్లి మీ తమ్ముణ్ణి తీసుకొస్తాను. " అన్నాడు మూర్తి.

ఎవరేనా ఆత్మీయులు పోయినప్పుడు టెలిగ్రాం వస్తే ఎలా ఏడుస్తారో అలా కుప్పకూలి పోయాడు -

" నా తమ్ముడు .. నా తమ్ముడు ... " అంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

" నా తమ్ముడు.... ఒక రోజు ... " అంటూ మొదలుపెట్టాడు. " నాది నారాయణ కిళ్లీషాపు - ఆరోజుల్లో - "

* * *

నారాయణ కిళ్లీషాపంటే కాకినాడ మెయిన్‌రోడ్‌లో ఒక ప్రత్యేకత ఉంది. అక్కడ దొరకని పత్రికలుండవు.

రామ్మోహనరావుగారొస్తే 'మిసిమి' పత్రిక,

గుర్రాజుగారొస్తే ' ఆహ్వానం'

పి.యస్. వస్తే ' సాహిత్యనేత్రం '

మూర్తిగారొస్తే ' ఆంధ్రప్రభ '

నాయుడుగారొస్తే ' స్వాతి '

ఇలా ఎవరే పత్రికకోసం వస్తారో. అలాగే, ఫలానా వ్యక్తికి ఫలానా కూల్‌డ్రింక్ అన్నది తెలుసతనికి.

ఇక పాన్‌ల విషయానికొస్తే ఒకరికి రత్న జర్దా, ఇంకోళ్లకి బాబా, బాబుల్ కలిపి, ఇంకోరికి మిఠాయికిళ్లీ, కొందరికి కలకత్తా ఆకు –

ఇలా అతని కంప్యూటర్ మెదడులో ఎన్ని బటన్లున్నాయో అనిపించేది నారాయణని చూసేవాళ్లకు.

నారాయణ ఒక చేత్తో కిళ్లీలు కడుతూ, మరో చేత్తో పత్రికలిస్తూ, నశ్యం పొట్లాలు కడుతూ, సిగరెట్లు, చాక్లెట్లు ఇస్తూ అష్టావధానం చేస్తున్నాడు. ఎవళ్లక్కావలసింది వాళ్లకివ్వడం చెప్పుకోదగ్గ విషయం.

ఈలోగా " అన్నయ్యా ! ఇది [illegible]న్నావా? " అంటూ నారాయణ తమ్ముడొచ్చాడు కొట్టు ధగ్గరికి.

" ఏంటిరా ? "

" మన వీరభద్రం మామయ్య కొడుకు సత్యం లేడూ– "

" ఉన్నాడు. వాడికేమయింది? " అంటూ తన పని తను చేసుకుంటూనే ఉన్నాడు నారాయణ. నోట్లో, జర్దా కిళ్లీ నలుగుతూనే ఉంది.

ఓసారి ఎవరో " అదేంటయ్యా బాబూ ! నువ్వు రోజుకి పది కిళ్లీలు నమిలేస్తున్నావ్. నీ లాభం గుబలకంటుకుంటుంది. " అన్నార్ట.

" సర్లెండి బాబూ ! ఏ అలవాటూ లేకపోతే నేను మనిషినెలా అవుతాను. " అన్నాట్ట నారాయణ. నిజమే.

ఘనాపాఠీలు, పెద్ద పెద్ద వేద పండితులూ – ఆచార వ్యవహారాల్లో వాళ్లకెవరూ సాటిరారు – అయినా చిటికెడు నశ్యం పడకపోతే పనస రాదు వాళ్ల కంఠంలోంచి.

" సత్యం బావ ఫొటో ఇవాళ సినిమా, పత్రికలో పడిందన్నయ్యా ! వాడు పెద్ద మ్యూజిక్ డైరెక్టరై పోయాడు. మనింట్లో అరుగుమీద కూర్చుని, రోజూ పొద్దున్నే వయొలిన్ 'కుయ్ కుయ్' అనిపించేవాడు. మన నిద్రలు పాడుచేసేవాడు. దశ అంటే అలాగ – " చెప్తున్నాడు

నారాయణ తమ్ముడు.

" టికెట్ లేకుండా వయొలిన్ బాక్స్‌తో ఓరోజు గౌతమి ఎక్కేశాడు వాడు. తెలుసురా నీకు ! "

" నేను హైద్రాబాదెళ్లి సత్యంబావ దగ్గర ఏదో ఉద్యోగం సంపాదిస్తానన్నయ్యా ! కనీసం మ్యూజిక్ ట్రూప్‌లో గజ్జెల చక్రం తిప్పినా చాలు. "

తమ్ముణ్ని నిశితంగా చూశాడు నారాయణ.

" ఒరేయ్ ! ఇప్పుడు నీకేం లోటొచ్చిపడిందిరా ! హాయిగా తిని తిరక్క ఎప్పుడైనా వచ్చి సరదాగా కొట్లో కూర్చో ! నువ్వు చదువుకున్న డిగ్రీ వ్యాపారంలో ఉపయోగించు. మన బతుకులిలా వెళ్లిపోతే చాలు. "

" అవుననుకో అన్నయ్యా ! ఎన్నాళ్లిలా నువ్వు సంపాదిస్తూంటే నేను తిని కూర్చోడం? డిగ్రీ చదువుకుని చివరికి కూలిపనికూడా రాజీపడి వెళ్లలేని స్థితి.. "

నారాయణ తమ్ముడి మాటలకడ్డొచ్చి

" పోనీలేరా ! సరదా తీరుతుంది. ఓసారి సత్యం దగ్గరకెళ్లులే. బయట ప్రపంచం తెలుసుకుంటే మంచిది. "

" రేపు గౌతమి కెడతానన్నయ్యా ! "

కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్లో గౌతమి ఎక్స్‌ప్రెస్ స్లీపర్‌బోగీ దగ్గర తమ్ముడికి జాగర్తలు చెబుతున్నాడు నారాయణ. ప్లాట్‌ఫారమ్ నిండా జనం. ఎక్కేవాళ్లకన్న సెండాఫ్‌కి వచ్చినవాళ్లే ఎక్కువున్నట్లున్నారు.

" అరేయ్ జాగ్రత్త. హైద్రాబాదులో మోసగాళ్లుంటారు. ఈ లోపుగా దిగి ఏమీ కొనుక్కోవద్దు. దార్లో రైలు దిగొద్దు. దిగితే మళ్లీ ఎక్కలేవు. రైలు కదిలిపోతుంది. ఈ బ్రెడ్ తిను. సీసాలో నీళ్లు తాగు. ఇంకేం కొనమాకు. వెళ్లగానే టెలిగ్రాం ఇయ్యి.. "

" అన్నయ్యా ! నేనేం చిన్న పిల్లాణ్ణా ! "

" ఒరేయ్ ! అమ్మ పోతూ నిన్ను నాకప్పజెప్పింది. మీ వదినకీ, నాకూ నువ్వే కొడుకువిరా.. " అంటూ కంటతడిపెట్టుకున్నాడు.

" పిచ్చి అన్నయ్యా ! ఎంత ! నాల్రోజుల్లో వచ్చేస్తాలే ! "

రైలు కదిలింది. నారాయణ తన శరీరంలో సగభాగం తీసుకెళ్లిపోతున్నట్లుగా ఆ రైలుని చూస్తూండిపోయాడు.



అమ్మ చనిపోతూ " ఒరేయ్ నారాయణా ! నీ పెళ్లి చూడాలనుకున్నాను. తమ్ముడు

జాగ్రత్త. దేముడు ముందే పిల్చాడు నన్ను. కోడలొచ్చాక వాడిని అశ్రద్ధ చేయకు. " అని చేతిలో చెయ్యేసి తమ్ముణ్ణి అప్పజెప్పింది.

అమ్మకోసం, అమ్మకిచ్చిన మాటకోసం, ఇంట్లో ఆడదిక్కు కావాలి గాబట్టి పెళ్లయితే చేసుకున్నాడు గాని, భార్యకు తెలియకుండా, పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాడు నారాయణ.

" ఏమండీ! మనకి పిల్లలు పుట్టేయోగం లేదనుకుంటా అయినా ఓసారి డాక్టరుదగ్గర కెళ్దాం " అని భార్య అంటే

" చూద్దాం లే! మనకిప్పుడు పిల్లలెందుకు ! నా తమ్ముడే మన కొడుకు. " అనేవాడు.

అతని భార్య చిరునవ్వులు చిందించేది అతని మాటలకి. " ఇదేం పిచ్చిప్రేమరా బాబూ ! " అనుకుంటూ.

* * *

అక్కడ – తమ్ముడు సికింద్రాబాదులో గౌతమి దిగాడు. అబ్బ ఎంత పెద్ద స్టేషను ! తన స్నేహితులు చెప్పిన జాగ్రత్తల ప్రకారం పోలీసులు రైలు దిగిన ప్రయాణీకుల కోసం ప్రత్యేకంగా ఆటోలు ఎక్కించే చోటికెళ్లి లైన్లో నుంచుని వచ్చిన ఆటో ఎక్కాడు. జూబ్లీహిల్స్‌కి పోనిమ్మన్నాడు.

ఆటోడ్రైవర్‌కి సత్యం సంగతి చెప్పగానే శ్రద్ధగా

" సత్యంసాబ్ మీకు రిలేషనా? " అన్నాడు.

" అవును నాకు బావవుతాడు. "

ఈలోగా జూబ్లీహిల్స్‌లో పెద్ద పోష్‌బంగ్లా ముందు ఆటో ఆగింది.

బంగ్లా ముందు మారుతీకార్లున్నాయి. ఎర్రని టయోటాకారుంది గుమ్మం ముందుగా. గేటు దగ్గర గూర్ఖా. ఆటో దిగి లోపలికెలా వెళ్లాలా అని ఆలోచిస్తూంటే, ఓ వ్యక్తి గబగబా వచ్చి టయోటా ఎక్కుతున్నాడు.

అవును. అతనే సత్యం బావ !

" సత్యం బావా! " అని గట్టిగా కేకేశాడు. తప్పదు మరి. లేకపోతే గూర్ఖా లోపలికెళ్లనివ్వడు.

గేటు దగ్గర బ్రీఫ్‌కేసుతో నిలబడ్డ తమ్ముణ్ణి చూశాడు సత్యం " ఎవడో– రోజుకొకడు తన ఊరినుంచి వస్తూంటారు. వీడెవడో.. " అనుకున్నాడు.

గబగబా సత్యం దగ్గరికెళ్లాడు.

" నేను బావా! నారాయణ తమ్ముణ్ణి. మీరు మా యింటెదురుగా ఉండేవారు కాకినాడ్లో. గుర్తుందా ! "

పరిచయం బంధం అవుతోంది. బంధం అనుబంధం అవుతుంది. ఆ తర్వాత అనుబంధాలు తెంపుకోవడం కష్టం. అదే మొదట్లోనే పరిచయం లేనట్లుగా ప్రవర్తిస్తే అసలు సమస్యే లేదుగా.

సత్యం ఈ పద్ధతి పాటిస్తూంటాడెప్పుడూ.

నెంబర్ వన్ పాలియెస్టర్ పంచె మీద పట్టులాల్చీ వేశాడు. యాపిల్ పండులా మెరిసిపోతున్నాడు. మెడలో నాలుగైదు గొలుసులున్నాయి. ముంజేతికి బ్రేస్‌లేట్. చేతివ్రేళ్లకు ఉంగరాలు. ముందుకు పడ్డ జుట్టుని వెనక్కు తోసుకుంటున్నాడు అప్పుడప్పుడు. సాదాసీదా దుస్తుల్లో ఉన్న నారాయణ తమ్ముణ్ణి చూస్తే సత్యానికి వెగటుగా ఉంది.

" అయితే ఏంటి పని? " ప్రశ్నార్థకంగా చూశాడు.

ఆ మాట తమ్ముడి గుండెల్లో సైలెన్సర్ పిస్టల్లోంచి వచ్చిన గుండులా దూసుకుపోయింది. ఇప్పుడే ఉద్యోగం అంటే గెటవుట్ అంటాడేమో !

" ఏం లేదు. అన్నయ్య నీదగ్గరకెళ్లి సరదాగా స్టూడియోలు, సినిమాయాక్టర్స్‌నీ చూసిరమ్మన్నాడు. "

' వీడు ఉద్యోగానికి రాలేదు. ఫర్వాలేదు. ఒకరోజు స్టూడియోలు తిప్పితే పోతాడు. ' అనుకుని

" సర్లే ! లోపలికెళ్లి రెస్ట్ తీసుకో. సాయంత్రం షూటింగ్‌కి తీసికెడతాను. "

' ఎత్తు సుమారు ఆరడుగులున్నాడు. ఎత్తుకు తగ్గలావు. చాక్‌లెట్ కలర్ ప్యాంట్‌మీద, స్ట్రైప్స్ ఉన్న షర్ట్ టకప్ చేశాడు. చామనచాయగా ఉన్నాడు. వీడు హీరోగా పనికొస్తాడు – కాని డబ్బులెవరిస్తారు? ఫస్ట్ పిక్చర్లోనే హీరోగా వెయ్యాలంటే పెట్టుబడి కూడా పెట్టాలి మరి

ఏంటో ! ఆలోచనలు ఇలా వెళ్లిపోతున్నాయి.. ' అనుకుంటూ టయోటాలో కెక్కబోతూ, గూర్ఖాని పిల్చి

" సాబ్ ని గెస్ట్‌హౌస్‌లో ఉంచు. ఏర్పాట్లు చూడు. " అని చెప్పి వెళ్లిపోయాడు.

" ఏవోయ్ ! నేను వయొలిన్ వాయిస్తే వినసొంపుగా లేదా? " అనేవాడు సత్యం.

" అదేంటి బావా ! అద్భుతంగా ఉంది. నిద్రరానివాళ్ళు నీ వయొలిన్ వింటే హాయిగా నిద్రపోతారు. " అనేవాడు తను. కాని తనకి ఆ వయొలిన్ విన్నప్పుడల్లా రేడియోలో పెద్దవాళ్లెవరేనా పోయినప్పుడు వచ్చే శోకరాగాల్లా అనిపించేవి.

" అలా ప్రోత్సహించాలోయ్ ! నేను గన్నా సినిమాల్లో - కెడితే నిన్ను నాదగ్గర పెట్టుకుంటా " ననేవాడు. చాక్లెట్లు కొనిపెట్టేవాడు తనకి.

ఈ లోగా గూర్ఖా " రండి సాబ్ ! " అనడంతో అతని వెంట లోపలికి నడిచాడు.

' పాపం పిచ్చోడు ! సినిమాఛాన్స్ కోసం వచ్చుంటాడు. ఇలాంటోళ్లు హైద్రాబాదుకొచ్చి చివరకి గ్రూప్-డ్యాన్స్‌ల్లో కూడా చోట్లు దొరక్క హోటల్స్‌లో సర్వర్స్‌గా పనిచేస్తున్నారు. కొంతమంది జులాయిలైపోయారు. ' అనుకుంటున్నాడు గూర్ఖా.

" సాబ్ ! సినిమాఛాన్సు కోసం వచ్చారా ! "

" లేదు. సత్యం మా బావే ! సరదాగా షూటింగ్స్ చూద్దామని వచ్చాను.. " అన్నాడు మళ్లీ అబద్ధమే. ' లేకపోతే వీడికి లోకువైపోతాను ' అనుకున్నాడు తమ్ముడు.

జీవితం ఒక నటన. అబద్ధాల పుట్ట. డబ్బులు తీసుకుని నటించేవాడిని అబ్బ ! ఎంత బాగా నటించాడనుకుంటాం గాని డబ్బులు తీసుకోకుండా ఎంత మంది ఎన్నిరకాలుగా నటించడం లేదు ! మంచివాళ్లు చెడ్డవాళ్లుగా, చెడ్డవాళ్లు ఉత్తములుగా, నకిలీ భార్యాభర్తలు, నకిలీ డాక్టర్లు, నకిలీ యాక్టర్లు, నకిలీ ప్రేమలు, అభిమానాలూ.. ఛీ! జీవితం అంతా డూప్ ! తమ్ముడి మనసంతా పరిపరివిధాల ఆలోచనల్లోకి వెళ్లిపోయింది.

అన్నయ్య దగ్గరకెళ్లిపోవాలి. ఏంటి ఇంకా ఇరవై నాలుగ్గంటలైనా కాలేదు అన్నయ్యని వదిలి. జీవితంలో ఈ రక్తసంబంధాలకు కట్టుబడి ఉండిపోవడం, బంధాలు తెంపుకోలేకపోవడం, ఒకరినొకరు చూడకుండా ఉండలేకపోవడం కూడా ఒక పిచ్చిలాంటిది. వీళ్లు కూడా ఒకరకం పిచ్చాళ్లే !

' ఏమిటో ! కాకినాడ తిరిగెళ్లేలోగా ఎన్ని అబద్ధాలాడాలో, ఎలా నటించాలో? ' అనుకుంటున్నాడు.

బంగ్లా లోపలకెడుతూంటే తన కాళ్లమట్టి నేలకంటుకుంటుందేమోనన్నట్లుగా నున్నగా ఉంది నేల. తివాసీలు, సోఫాలు, గదుల్లో మూలల అందమైన శిల్పాలు, తళతళా మెరిసే ఇత్తడి పూలకుండీల్లో పచ్చని మొక్కలు, గదుల నిండా సువాసనలు వెదజల్లే పెర్ఫ్యూమ్స్.

తమ్ముడు తనకి కేటాయించిన గదిలో సోఫాలో కూర్చున్నాడు. అంతలో నాలుగు

పామరిన్ కుక్కపిల్లలొచ్చి తమ్ముణ్ణి వాసన చూసి గొంగళిని చూసినట్లు చూసి వెళ్లిపోయాయి.

తమ్ముడు కాళ్లు ముడుచుకుని సోఫాలోనే పడుకున్నాడు. భోజనానికి పిలిస్తే వెళ్లి డైనింగ్‌టేబుల్ దగ్గర కూర్చుంటే అన్నా, వదినా గుర్తుకొచ్చారు.

పంచభక్ష్యపరమాన్నాలున్నా అవి తినలేకపోయాడు.

తన గుండెలు కాకినాడ వేపు పరుగెత్తసాగాయి. ఎందుకో అన్నయ్య అనుక్షణం గుర్తుకొస్తున్నాడు. తను వెళ్లిపోతాడు కదా త్వరలో !

జీవితంలో ఈ ప్రేమానుబంధాలు విడదీయలేని మమతానురాగాలతో చిక్కగా అల్లుకుపోయి బాధిస్తాయి. జీవితం శాశ్వతమా? అన్నయ్య, వదినలతో తాను ఎన్నాళ్లు కలిసుండగలడు?

తమ్ముడి మనస్సు కాకినాడ - హైద్రాబాదుల మధ్య ఊగిసలాడుతూంది.

ఇంతలో -

" మీ బావగారు షూటింగ్‌లో ఉన్నారు. మిమ్మల్ని తీసుకురమ్మన్నారు. " అంటూ ఒక వ్యక్తి వచ్చాడు.

" అదేంటి సాయంత్రం వెళదామన్నాడే ! "

" కాదు. నాగార్జున షూటింగుందని ఇప్పుడే తెలిసిందట. మిమ్మల్ని అర్జెంటుగా తీసుకురమ్మన్నారు- "

" భలే ! నాగార్జున షూటింగా... " అంటూ ఆ వ్యక్తిని అనుసరించాడు.

ఒకరోజు షూటింగ్ చూశాక సత్యం బావ మంచి మూడ్‌లో ఉండగా చిన్న ఉద్యోగం చూడమని అడగాలి. తన కాళ్లమీద తాను నిలబడి, అన్నయ్యకూ, వదినకీ డబ్బు పంపాలి. అప్పుడు చూడాలి అన్నయ్య ముఖంలో ఆనందం ! తమ్ముడి మనసు ఉరకలు వేస్తోంది మారుతీకారుకన్నా వేగంగా. అప్పుడే నాలుగు మెతుకులు తిన్నాడేమో కాస్త కునుకు పట్టింది.

" దిగు... " కేక కర్కశంగా వినబడింది. తమ్ముడు కళ్లు తెరిచాడు.

ఇద్దరు వస్తాదుల్లాంటి వ్యక్తులు, తమ్ముణ్ణి చెరో రెక్కా పుచ్చుకుని అతని నడకతో నిమిత్తం లేకుండా నడిపించుకెడుతున్నారు.

" ఏంటిది? వదలండి ! నేను షూటింగ్ చూడాలి.... "

తమ్ముడు నడవకపోతే లాక్కెళ్లిపోతున్నారు.

" నన్ను రక్షించండి ! వీళ్ళెవరో నన్ను బలవంతంగా లాక్కెళ్లిపోతున్నారు. నాది కాకినాడ. షూటింగ్ చూడాలని వచ్చాను.. " అరుస్తున్నాడు తమ్ముడు.

అదొక పెద్ద బిల్డింగ్. ఎన్నో అంతస్థులతో చెప్పలేనట్లుగా ఉంది. జనం చాలా వేగంగా పరుగుల్లాంటి నడకలతో వెళ్తున్నారు.

ఈ దృశ్యం చూసి " ఏమిటది. అతన్ని వదలండి! " అన్నారు కొంతమంది.

" చాల్లెండి ! ఇతనికి పిచ్చెక్కింది. హాస్పటల్లో జాయిన్ చెయ్యడానికి తీసుకెళ్తున్నాం." అంతే ! తమ్ముడి వేపు ఎవరూ చూడటం మానేశారు. గట్టిగా గింజుకొని వదిలించుకోబోయాడు. వాళ్లబారి నుంచి ఎలాగో తప్పించుకుంటే చాలు. తన బలమంతా ఉపయోగించసాగాడు.

అంతే ! మెడపైన బలమైన గుద్దె పడింది. తమ్ముడి కళ్లల్లో మెరుపు మెరిసింది. ఆ మెరుపులో అన్నయ్య వదిన. స్పృహతప్పిపోయాడు.

" వీడికి మెళుకువ వస్తుందేమో చూస్తూండు. నేను లోపలికెళ్లి మాట్లాడొస్తాను. " అంటున్నాడు మొదటివాడు.

" వాడిక లేవడు. " అన్నాడు రెండోవాడు.

తమ్ముడికి స్పృహ వచ్చింది. తను ఒక హాస్పటల్లో స్ట్రెచర్ మీద ఉన్నాడు. తలకు కూడా తెల్లని గుడ్డ కప్పేశారు. తల దగ్గర గుడ్డ తొలగించి చూశాడు. తనని కార్లో తీసుకొచ్చినవాడున్నాడు తన దగ్గర. వాడెప్పుడు చూశాడో, మళ్లీ తమ్ముడి మెడ మీద మరో దెబ్బ వేశాడు. తిరిగి తమ్ముడి కళ్లల్లో చీకటైంది.

ఎవరో తన చెయ్యి పట్టుకున్నారు. తమ్ముడికి మెలకువ. వచ్చింది. కళ్లు తెరిచాడు. ఎదురుగా తెల్లని బట్టల్లో నలుగురు వ్యక్తులు.

" ఏమండీ ! నాకేం జబ్బు లేదు. నన్ను వీళ్లు తీసుకొచ్చారు షూటింగు చూపిస్తామని. దయచేసి నన్ను పంపించెయ్యండి. మా అన్నయ్య నేను లేకపోతే చచ్చిపోతాడు...." అంటున్నాడు తమ్ముడు సజలనయనాలతో.

" ఇదీ సార్ ! తంతు ! అస్తమాను షూటింగంటాడు.. "

" అలాగా.. " అంటూ చేతికొక ఇంజెక్షనిచ్చాడు.

" కూల్ డౌన్ మైడియర్ బోయ్ ! పంపించేస్తాంలే నిన్ను ! " అన్నాడాయన.

" సార్, రెండు కళ్లూ, రెండు మూత్రపిండాలూ.. ఇంకా ఏమన్నా పనికొస్తే తీసుకోండి.

కుర్రాడికి పెళ్లికూడా కాలేదు. మాంచి బలంగా ఉన్నాడు. "

" ఎంత కావాలి? "

" మొత్తం రెండులక్షలిచ్చెయ్యండి. "

" కాదులే. రెండు మూత్రపిండాలకీ లక్షా. రెండు కళ్లకీ ఇరవై వేలు. అంతే. మీకిష్టమైతే రేపొచ్చి బాడీ తీసికెళ్లండి ! డిస్పోజల్ మీదే ! .... "

" సరే! అలాగే కానివ్వండి ! "

" ఇక మీరెళ్లచ్చును..... "

" నన్ను కాకినాడ పంపించె.... " తమ్ముడు మత్తులో గొణుక్కుంటున్నాడు.

* * *

" తమ్ముడూ ! ...... " అంటూ నారాయణ బడ్డీకొట్లో ఒక్కొక్క వస్తువూ బయటకు విసిరేస్తున్నాడు.

సిగరెట్ పెట్టెలు, కూల్‌డ్రింక్ సీసాలు, చాక్లెట్ సీసాలు, తమలపాకులూ, పాన్ సామాన్లు, పుస్తకాలు చింపి పారేస్తున్నాడు. బట్టలు చింపేసుకున్నాడు. ఆ ప్రాంతంలో రోడ్డంతా సిగరెట్లు, సీసా ముక్కలతో, తమలపాకుల్తో.. రంగురంగుల్లో అర్థంగాని మోడర్న్ ఆర్ట్ లాగుంది.

" ఏమయింది?.. " అంటూ జనం చుట్టూ మూగేరు, నారాయణ చేతిలో పేపరు చూశారు. అందులో

" ఈ మధ్యనే నగరానికి వచ్చిన ఒక యువకుని శరీరం టాంక్‌బండ్ ఒడ్డున దొరికింది. అందులో శరీరంలో కొన్ని భాగాలు తీసివేసినట్లుగా, శరీరం అంతా కోసి ఉంది. అవయవాల అమ్మకానికి సంబంధించిన ముఠా యొక్క చర్యగా భావిస్తున్నారు. ఈ యువకుని ఫొటో చూసి వారి బంధువులెవరైనా వస్తే, ఆ యువకుని జేబులోని వస్తువులు అందజేయబడతాయి. - నగర పోలీసు శాఖ. "

" అయ్యో ! నారాయణ తమ్ముడిలాగే ఉన్నాడే ! "

" లాగా ఏంటి? అతనే ! హైద్రాబాదు ఉద్యోగానికని వెళ్లాట్ట ! " అనుకుంటున్నారు.

" అవును. మా తమ్ముడే ! వస్తాడు. వచ్చేస్తాడు ! " నారాయణ నవ్వుకుంటున్నాడు.

ఇప్పటి నారాయణ స్థితి ప్రేమాభిమానాలకు, రాగద్వేషాలకు, సృష్టి స్థితి లయాలకూ అతీతమైనది. కంటి వెంట కన్నీరు సెలయేరులా పారుతోంది. తమ్ముణ్ణి కోల్పోయానన్న బాధ

ఎదలో కరిగి కన్నీరై పారుతోంది. నారాయణ నవ్వుతూ ఏడుస్తున్నాడు. అతని ప్రపంచమే వేరు.

" రేపు గౌతమిలో మీ తమ్ముడొస్తాడులే. ఇప్పుడే టెలిగ్రాం వచ్చింది... " అన్నాడు మూర్తి.

" భలే చెప్పారండి ! ఉండండి మీకో కూల్‌డ్రింకు కొడతాను.. " అంటూ ఖాళీగా ఉన్న బడ్డీకొట్టు ఎక్కాడు.

ఇదే సందనుకుని మూర్తి చకాచకా రోడ్డుకి అవతలివైపుకు వెళ్లిపోయాడు.

నారాయణ లోపలికెళ్లి సీసా తీసినట్లు, ఓపెన్ చేసినట్లుగా చేసి " అరే ! ఈయనెళ్లిపోయాడే ! ఒక డ్రింకు వేస్టయింది.. " అనుకుంటూ

" పోన్లే ! తమ్ముడొచ్చేస్తున్నాడు. " అనుకుంటూ క్రిందకు దిగి, ఊగుతూ ఉండే పాత స్టూల్ మీద కూర్చుని రోడ్డు వేపు చూస్తున్నాడు.

***

---

' ఈ కొట్టుకు శెలవు లేదు ' కథ ఒక్క బిగిన చదివాను. మళ్ళీ మళ్ళీ చదివాను. కళ్ళ వెంట నీళ్ళు ఆగకుండా వచ్చాయి. భాతృప్రేమ ఔన్నత్యం చిత్రణ అలా వుంది. కథనం కూడా ఉన్నతస్థాయిలో ఉంది.

–డా॥వి.వి.యల్. నరసింహారావు.